# స్వాతిమృగాలు

కె.వి.వి. సత్యనారాయణరాజు

జగాకాణీల కాలం వెళ్లిపోయినా కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నవాణ్ణి. కాణీ కట్నంలేకుండా పెళ్ళి చేసుకున్నాడని అనడం పరిపాటి.

రూప కళ్ళకు పదివేలూ, ముక్కుకు ఇరవైవేలూ, నోటికి ముప్పైవేలూ ఇలా ప్రతి అవయవానికీ మనసులోలెక్కలు కట్టి మూడులక్షలు విలువచేసే మీ అమ్మాయిని నాకప్పగిస్తున్నారు. అంతకంటే కట్నం ఏం కావాలి? అని అత్తమామల్ని సంతోషపరచి కన్నవాళ్ళ ఉసురుపోసుకుని పెళ్ళయిన పన్నెండోరోజే భార్యతో సహా చికాగోలో వాలాడు అశోక్.

ఇండియాలో అతడు చదువుకున్న మేనేజ్‌మెంట్ కోర్స్ స్వదేశంలోని కంపెనీలను మేనేజ్ చేయడానికి పనికిరాదని నిర్ధారణ అయ్యాక విశాలమైన ప్రపంచంలో తన సామర్థ్యం చూపించడానికి ఓ టేబులూ, కుర్చీ పట్టేటంత చోటుదొరికితే చాలని తీర్మానించుకుని తీవ్రంగా ప్రయత్నించాక ప్రస్తుతం అతడు చేస్తోన్న ఉద్యోగం దొరికింది.

అధునాతన సౌకర్యాలు మనిషికి శారీరక సుఖానిస్తాయి. అవే సౌకర్యాలు పక్కవాడికి లేకపోతే అవి మానసిక సౌఖ్యాలు కూడా ఇస్తాయి. ఎక్కువగా ఆడవాళ్ళ విషయంలో రెండోది నిజం.

వెయ్యిరూపాయల చీర కట్టుకుని అడవిలో తిరిగితే వంటికేమోగానీ మనసుకు తృప్తిఉండదు. అదే స్థితి మహానగరాల్లోనూ కనిపిస్తుంది.

కానీ ఓ మాదిరి పట్టణాల్లో వందరూపాయల చీర కట్టుకుని కనబడ్డ వాళ్ళందరితోనూ దాని ఖరీదు రెండువందలని చెప్పుకుంటే ఎదుటి వ్యక్తి కళ్ళలోని అసూయకు రెట్టింపు ఆనందం చీర స్వంతదారుకు కలుగుతుంది.

దేశంకాని దేశంలో శరీరాన్ని శ్రమ పెట్టవలసిన అవసరం లేకుండా అన్ని సౌకర్యాలుఉన్నా రూప మనసుకు మాత్రం తృప్తిలేదు. ఆ అసంతృప్తి తనతో పోల్చుకోవడానికెవ్వరూ లేకపోవడంవల్ల వచ్చింది.

తన జాడ్యానికి మందువేసే ప్రయత్నంలో భాగంగా ఓ రాత్రి భర్తపక్కలో చేరి తెలుగువాళ్ళ పొరుగుండే ఇంటికి మారదామని మారంచేసింది రూప.

పెళ్ళయిన కొత్తలో భార్యతో పొందవలసిన అనుభూతిని దూరంచేసుకునే ఆలోచన అతడికి లేదు. భార్య కోరికలుతీర్చాల్సిన బాధ్యత మగాడిమీద ఉంది కనుకనే ఎక్కువ సందర్భాల్లో భార్యలణిగిమణిగి ఉంటారనే విషయం అతడికి తెలుసు. అలా పెళ్ళాల కోరికలు తీర్చలేని ఎంతోమంది మగాళ్ళు తమ భార్యలు పరాయి మగాళ్ళనారాధించడాన్ని మౌనంగా భరించడమూ అతడికి తెలుసు.

భార్య ప్రతి కోరికనూ మగతనానికి సవాల్‌గా తీసుకోవడం అన్నివేళలా అంత మంచిది కాకపోవచ్చు. కానీ కోరిచేసుకున్న పెళ్ళం కోరకకోరక ఓ చిరుకోరిక కోరితే అదినెరవేర్చలేనప్పుడ తమ మగతనానికే అర్థంలేదనే విషయాన్నామె ముందుచెప్పినా ఒప్పుకోవలసిన అవసరం తనకు రావచ్చునని పించి "అలాగే చూద్దాంలే" అన్నాడు ఇక ఆ విషయం మాట్లాడి టైమ్ వేస్ట్ చేయొద్దన్నట్టుగా.

"చూద్దాంలే అంటే కాదు" అంది రూప అపనమ్మకంగా.

"ఒట్టేయమంటావా?" అన్నాడు అశోక్ ఆమెను దగ్గరకు లాక్కుంటూ.

"అవసరం లేదులెండి. మీమీద నాకామాత్రం నమ్మకముంది" అంది రూప ముందరి కాళ్ళకు బంధంవేస్తూ.

అతడి చిత్తశుద్ధి ఫలితమో ఆమె కోరికలోని నిజాయితీ బలమోగానీ అతి కొద్దిరోజుల్లోనే ఆమె కోరికను తీర్చగలిగాడతడు. ఆ ఇంట్లోకి మారాక భార్య కళ్ళలో కనిపించిన వెలుగును కొలవడానికి ఏ ఫోటో మీటరూ పనికిరాదేమోనని పించిందతడికి.

వాళ్ళ ఫ్లాట్ కెదురుగాఉండే ఫ్లాట్‌లోనే ఓ తెలుగుజంట ఉంది. స్వదేశంలో ఇద్దరి జిల్లాలకు మధ్యనొకటి రెండు జిల్లాల దూరంఉన్నా దేశంకాని దేశంలో ఎదురెదురు ఇళ్ళలో ఉండడం ఎంతో ఆనందం కలిగించింది ఉభయులకూ.

వంటల్లో ఒకరుచేసే ప్రయోగ ఫలితాలను మరొకరు రుచి చూడ్డం, ఒకరి చీరను మరొకరు మెచ్చుకోవడం ఒకరి గుణగణాలను మరొకరు పొగడడం పైకీ ఒకరి వంటను మరొకరు విరసించడం కట్టుబొట్లను చూసి నవ్వుకోవడం ఎదుటివారి మాట్లాడే ధోరణిని వ్యాఖ్యానం చేయడం తమ భర్తల దగ్గరా చేయడంతోపాటు మనసుల్లో ఒకరి భర్తతో మరొకరి భర్తను పోల్చుకోవడం కూడా ప్రారంభం కావడానికి రెండు పౌర్ణమిలూ మరో రెండు అమావాస్యలకన్నా ఎక్కువ సమయం పట్టలేదు ఆడవాళ్ళిద్దరికీ.

ఆ విధంగా తమతమ ఇళ్ళకు కొన్నివేల మైళ్ళదూరంలో తాము పుట్టిపెరిగిన వాతావరణాన్ని తమ స్వశక్తిలో సృష్టించుకోగలిగారా ఆడవాళ్ళిద్దరూ.

బ్రాందీ మొదటిసారిగా రుచి చూసినవాడికి దాని రుచి నచ్చకపోయినా పదేపదే రుచి చూడడం అలవాటైతే దానికి బానిస కావడం పెద్ద కష్టంకాదు. భార్యలు చెప్పే మాటలు మొదట్లో తమ కిష్టంలేకపోయినా కొంతకాలం కష్టపడివిన్నాక ప్రతిరోజూ ఈ రోజు విశేషాలేమిటని భార్యలనడగడం ఓ దినచర్యగా మారింది మగవాళ్ళిద్దరికీ.

ఓరోజు భర్తతో అంది రూప అతడింటికి వచ్చిరాగానే పుల్లారావుకు ప్రమోషన్ వస్తుందట కదా త్వరలో?!


అందరూ చవటలుగా తీర్మానించిన ఒక వ్యక్తి ఎవరికీ తెలియని అద్భుత రహస్యాన్ని బట్టబయలు చేసినప్పుడు అతణ్నింతవరకూ నిర్లక్ష్యం చేసినవాళ్ళెంత ఆశ్చర్యపోతారో అంత ఆశ్చర్యాన్ని అనుభవించాడు అశోక్. భార్య మాటలువిని.

తన భార్య చవటనే ఉద్దేశ్యం అతడికిలేదు. కాకపోతే ఏనాడూ ఆఫీసు విషయాలు చర్చించని భార్య ఆ రోజు తన ఊహలోకి కూడా రాని విషయాన్ని తెలియజేయడంతో అతడంతగా ఆశ్చర్యపోవాల్సి వచ్చింది.

**ఆలోచించాక భార్య మాటలు పూర్తిగా కొట్టిపారవేయదగ్గవిగా అనిపించలేదతడికి. విషయమనీ పేరుతో కాకాపట్టేవాళ్ళను పైకి గెంటడం కేవలం స్వదేశంలోనే ఉందనుకొంటే అది పొరపాటే అవుతుంది.**

అశోక్ ఆ కంపెనీలో చేరిన మూణ్నెల్లకు చేరాడు పుల్లారావు అదే కంపెనీలో అదే కేడర్‌లో. అటువంటప్పుడు తన ఊహలోకి కూడా రాని ప్రమోషన్ అతడిని వరించబోతుందంటే నమ్మదగ్గ విషయంగా అనిపించలేదు. అందుకే ఆలోచించాడు.

ఆలోచించాక భార్య మాటలు పూర్తిగా కొట్టిపారవేయ దగ్గవిగా అనిపించలేదతడికి. ఎఫిషియన్సీ పేరుతో కాకాపట్టేవాళ్ళను పైకిగెంటడం కేవలం స్వదేశంలోనే ఉందనుకుంటే అది పొరపాటే అవుతుందని అశోక్‌కు తెలుసు.



తనకంటే పుల్లారావు జూనియర్ అయినా అతడికి ప్రమోషన్‌వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఆలోచించగా స్ఫురించిందతడికి. లింకన్ కంపెనీ తయారుచేసే ప్రొడక్ట్స్ మార్కెటింగ్ చేసే పని కొద్ది రోజుల క్రితమే పుల్లారావుకప్పగించబడింది. అప్పుడే తనకనుమానం రావాలి నిజానికి. ఎందుకంటే తన కేడర్‌లోనే ఉన్న మిగిలిన ఉద్యోగులెవరికీ కూడా అంత పెద్ద కంపెనీ వ్యవహారాలు చూసే బాధ్యత ఎప్పుడూ అప్పగించబడలేదు. కానీ ఇప్పుడా పని తనకంటే జూనియర్ అయిన పుల్లారావు కప్పజెప్పబడిందంటే రూప మాటల్లో నిజముండడానికి అవకాశం ఉంది.

అయితే ఆ ఛాన్స్ పుల్లారావుకు రావడంలోని చిదంబర రహస్యమేమిటి? దానికి సమాధానం మర్నాడు తెలిసిందతడికి.

సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాబర్ట్ ప్రక్కన ఫ్రంట్ సీట్లో కూర్చుని గాలికెరిగిపోతున్న ముంగురుల్ని సర్దుకుంటున్న మంగళను చూసి ఆశ్చర్యపోయాడు అశోక్.

మంగళ పుల్లారావు భార్య.

కార్లో తానుచూసిన వ్యక్తి మంగళో కాదో తేల్చుకోవడంకోసం ఇంటికొస్తూనే అడిగాడు భార్యను "మీ ఫ్రెండ్ ఇంట్లోనే ఉందా?" అని.

ఇంటికొచ్చి రావడంతోనే మరో మాటలేకుండా ఎదురింటి ఆడదాని గురించి భర్త ఎంక్వయిరీ చేస్తే అందుకు విపరీతార్థంతీయని ఆడదాని స్త్రీత్వాన్నమామ్నించవలసిందే. అందుకే "ఏం అలాఅడుగుతున్నారు?" అంది రూప మనసులోని భావాలను దాచుకునే ప్రయత్నం చేస్తూ.

"ఏంలేదు ముందిది చెప్పు. ఆవిడింట్లో ఉందా?" అన్నాడు తిరిగి.

ఏదో విశేషం ఉండే భర్త అలా అడుగుతున్నాడని గ్రహించినట్టుంది . మధ్యాహ్నం పుల్లారావూ, మంగళా బయటికెళ్ళడం చూశాను. వాళ్ళిద్దరూ ఇంకా వచ్చినట్టులేరు" అంది.

తన కళ్ళు తనను మోసం చేయలేదనే నమ్మకం బలపడిందతడిలో. వెంటనే అన్నాడు "మొగుడితో బయటికెళ్ళి మంగళ రాబర్ట్‌తో కలసి కార్లోవెళ్ళడం ఇంతక్రితమే చూసాను. పుల్లారావేమై ఉంటాడంటావ్?"

ఆమె ఏదో జవాబు చెప్పేంతలో కాలింగ్‌బెల్ మ్రోగింది. తలుపుతీసిన రూప ఒకడుగు వెనక్కువేసి రండి అంది.

పుల్లారావు లోపలికి వచ్చాడు. అతడి చేతిలో స్వీట్స్ పాకెట్‌వుంది. అదామె చేతిలో పెడుతూ అశోక్‌వేపు తిరిగి"ప్రమోషన్ ఆర్డర్ ఇంతక్రితమే అందుకున్నాను. ముందుగా నా సంతోషం మీ ఇద్దరితోనూ పంచుకోవాలనిపించింది. రేపు గ్రాండ్‌గా పార్టీ ఎరేంజ్ చేస్తాను" అని వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయాడు.

"ఇతడెళ్ళి పెళ్ళాన్ని తీసుకురావాలేమో?" అన్నాడు అశోక్ పుల్లారావు బయటకు వెళ్ళిన వెంటనే.

అప్పుడంది రూప. ఇప్పుడు చెప్పండి. ఇందాక ఏదో అన్నారు. మంగళ ఎవరితోనో కార్లో కనిపించడమేమిటి? ఇతడెళ్ళి పెళ్ళాన్ని తీసుకురావడమేమిటి?"

నవ్వాడు అశోక్. ఇప్పుడర్థమైందినాకు. పుల్లారావుకు నాకంటే ముందుగా ప్రమోషన్ ఎలా వచ్చిందో...

"అంటే మీ ఉద్దేశమేమిటి? పుల్లారావు మంగళను రాబర్ట్‌తో..."

ఆ తరువాత మాట్లాడ్డానికామెకు బిడియం అడ్డొచ్చింది.

"కరెక్ట్ అందుకే అతడికి ప్రమోషన్ వచ్చింది ఇంతత్వరగా.

"ఛ... ఛ మరీ అన్యాయంగా మాట్లాడకండి" అంది రూప.

"ఇందులో అన్యాయం ఏముంది? రాబర్ట్ కిష్టమైన పని తనకిష్టమైనా చేశాడు పుల్లారావు. పదేపదే రుణం తీసుకోవాలనుకునేవాడు ఎదుటివాడి రుణం అలాగే ఉంచుకోడు కదా? అదే చేశాడు రాబర్ట్ కూడా"

"మీది మరీ చోద్యం. ఏ మగాడైనా పెళ్ళాన్ని మరో మగాడికి అప్పగిస్తాడా?"

"మైడియర్ రూపా. నా మాటలు నీకు సరిగా అర్థంకాలేదు. ఆఫ్‌కోర్స్ అందుకు నిన్ను తప్పుపట్టను. మనదేశంలో ఓ పెళ్ళయిన ఆడది పరాయి మగాడి పక్కన కార్లో కూర్చుని ప్రయాణించేంతవరకూ వచ్చిందంటే దానికర్థం అదొక్కటే. కనీ ఇక్కడలా కాదు. మొగుడెదురుగాఉన్నా పరాయి మగాడి భుజంమీద చేతులేయడంకూడా అంతగా పరిగణనలోకి తీసుకోవలసిన విషయంకాదు.

ఇక్కడ థ్రిల్‌గా భావించబడే విషయం మన ఊళ్ళో బూతు అలా అని ఇక్కడివాళ్ళకు శీలం మీద పట్టింపులేదని అనగాహనకునువ్వురాకూడదు.

పరాయివాడి పెళ్ళాన్నిచూసి మనసులో లొట్టలేయడం మన దేశపు నాగరికత. అలా చూడకు. నేనెప్పుడూ ఎవర్నీ అలా చూసి లొట్టలేయలేదులే. అలా లొట్టలేయకుండా అభిప్రాయాలు ఓపెన్‌గా చెప్పుకోవడం ఇద్దరికీ ఇష్టమైన పక్షంలో ఆ ఇష్టాన్ని అనుభవంగా మార్చుకోవడం ఇక్కడి పద్ధతి.

అంతమాత్రాన భర్తచాటు వ్యవహారాలు చేసే భార్యలూ అండ్ వైస్ వెర్సా ఇక్కడ ఎక్కువనే ఊహ కూడా నీ మనసులోకి రాకూడదు. నిజానికి చాటు మాటు వ్యవహారాలు మన దేశంలోనే ఎక్కువ."

"అయితే ఇంతకూ మీరనేదేమిటి?"

"పరాయి ఆడదానితో చనువుగా ఉండడంవల్ల కలిగే థ్రిల్‌ను రాబర్ట్ కందించి అతనిద్వారా తనకొవల్సిన పని జరిపించుకున్నాడు పుల్లారావు. అంతమాత్రానికే పుల్లారావుని డాఫర్ అని మనమనుకుంటే నిజమైనడాఫర్లకు వేరే పేరేదో వెదకాల్సుంటుంది. అయినా మనకెందుకు లెద్దూ ఆగొడవ?" అన్నాడు అశోక్.

తన ప్రసంగాన్ని సడన్‌గా అతడలా కట్ చేయడానికి కారణముంది. తన భార్యతో అతడు చెప్పుకోలేని కారణం అది. నిజానికి మంగళకంటే రూప ఎంతో అందంగా ఉంటుంది. రంగులోనే కాకుండా రూపంలో కూడా రూపదే పైచేయి.

కాకపోతే మంగళలా కలుపుగోలు స్వభావం కాదు రూపది. అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంతప్ప తనంత తానుగా ఎదుటివారిని సంభాషణలో ఇరికించే తెలివితేటలామెకు లేవు.


పుల్లారావుకు పట్టిన జాతకానికి అతడి భార్య చొరవ కూడా ఓ ముఖ్యమైన కారణం కావచ్చు. భార్యతో విషయం చెప్పే చొరవ అశోక్‌కులేదు.

బహుశ ఏ మగవాడికీ ఉండదేమో! పరాయి మగాడితో చనువుగా ఉండమని ఏ భర్త మాత్రం తన భార్యతో చెప్పగలడు? పరిస్థితి అర్థంచేసుకునిసహకరించే మంగళలాంటి వ్యక్తులైతే ఫర్వాలేదు.

అందుకే ఏమీ మాట్లాడాలనిపించక సంభాషణ అంతటితో ఆపుచేసాడు అశోక్.

* * *

మర్నాటినుంచి మంగళ ఏ సమయాల్లో ఇంట్లో ఉండేదో చెప్పడం ఓ క్రమంతప్పని అలవాటుగా



## ప్లాన్

మంత్రిగారు ఆవేశంలో స్పీచ్ ఇస్తూ అన్నారు—

"మనదేశంలో ముష్టివాళ్ళందర్నీ సైన్యంలోకి తరలిస్తే— ఇటు బీదరికానికి అటు దేశానికి రెంటికీ లాభదాయకమౌతుంది. మీరేమంటారు ప్రజలూ?"

"అప్పుడు బిక్షగాళ్ళు తుపాకీ పేల్చి పెట్టమని పక్కవాళ్ళను అడుక్కుంటార్లెండి" నో యువకుడు కొంటెగా అరిచి చెప్పాడు.

—పి.అశోక్
(వరంగల్)


డాక్టర్ కొత్త రవీంద్రబాబు
మొగలీ పువ్వంటి
డాక్టర్ కొత్త రవీంద్రబాబు
మొగలీ పువ్వంటి
డాక్టర్ కొత్త రవీంద్రబాబు
మొగలీ పువ్వంటి



## వేగం

టీవి న్యూస్‌రీడర్ని ఇంటర్‌వ్యూ చేస్తూ అడిగాడు సుదర్శనం—
"వార్తలు నెమ్మదిగా చదివినా తప్పులెందుకొస్తూ వుంటాయి?"
"వార్తలు వేగంగా చదివితే ఆ తప్పులు మీకర్థం కావని" వున్న సంగతి చెప్పాడు.

—మన్నవ సుధాకర్
(విజయవాడ)

మారిందిరూపకు. పుల్లారావు ప్రమోషన్‌లో మంగళ పాత్ర అర్థమయ్యాక ఆమెను తనతో సమానంగా చూడలేకపోయింది రూప.

కేవలం తమిద్దరిదీ ఊహే అయినా అదే తిరుగులేని నిజం అన్నట్లుగా అనిపిచేదామెకు. దానికితోడు భర్త మాటలు కూడా ఆమె అభిప్రాయాల్ని బలపరిచాయి. ప్రమోషన్ వచ్చాక పుల్లారావు హుషారుగా ఉండడం పోయి ఏదో పోగొట్టుకున్నవాడిలా దిగులుగా ఉంటున్నాడట ఆఫీస్‌లో.

విషయమేమిటో కనుక్కోమని తొందరపెట్టింది రూప. అశోక్‌కూ మనసులో ఆకోరిక ఉండడంతో భార్య మాటలు కేటలిస్ట్‌లా పనిచేసే యతడిమీద.

కానీ వెదకబోయినతీగ కాలికడ్డం పడినట్లు ఆడబోయినతీర్థం ఎదురైనట్టూ రోగి కోరిందే వైద్యుడు పథ్యంగా చెప్పినట్టూ రెండురోజులతర్వాత పుల్లారావు అన్నాడు అశోక్‌తో. నేను తప్పు చేశానేమో అనిపిస్తోంది.

అశోక్ మనసులో ఏమూలనోఉన్న అశాంతి ఆ మాటలతో తొలిగిపోయి ప్రశ్నార్థకంగా మొహం పెట్టాడు. నీ బాధనిటో చెప్పు. నాకుచేతనైంది చేస్తానన్న భావం అతడి మొహంలో గోచరించింది పుల్లారావుకు.

ఏదీ దాచుకోలేదతడు. అతడు చెప్పినదాని ప్రకారం భర్త సహించగలిగే హద్దుల్ని మంగళ దాటింది. పరాయివాడి పెళ్ళానికీ తనకూ మధ్య ఉండవలసిన దూరాన్ని అధిగమించాడు రాబర్ట్. ఇప్పుడేం చేయాలో అర్థం కావడంలేదతడికి.

దీర్ఘంగా నిట్టూర్చాడు అశోక్. తన భార్య కూడా మంగళలా ప్రవర్తించి ఉంటే తన స్థితి మెరుగుపడి ఉండేదన్న భావన కొద్దిరోజులక్రితం తనకు కలిగినందుకు తనను తానే నిందించుకున్నాడు. ఆ మాట తన భార్యతో అనకుండా ఉండంవల్ల తప్పిపోయిన ఉపద్రవాన్ని తలుచుకొని గుండెలమీద చేయి వేసుకున్నాడు.

సమస్య మనది కానపుడు ఎదుటివాడికద్భుతమైన సలహాలివ్వొచ్చును.

"మీరిప్పుడు చేసేదేం ఉంది! మంగళగారికి మీరు కావాలో అతడు కాలో తేల్చుకోమని అడగడమే" అన్నాడు అశోక్.

పుల్లారావు తలెత్తాడు. ఇప్పుడతడి మొహం దీనంగాలేదు. తను మనసులో అనుకున్న పరిష్కారాన్నే ఎదుటి వ్యక్తి సూచించినప్పుడు మనసుకు కలిగే తృప్తీ ధయిర్యం అతడి మొహంలో వ్యక్తమయ్యాయి.

నేనూ అదే అనుకుంటున్నాను. కాకపోతే ఆ విషయాన్ని నేనుగా నా భార్యనడగలేను. నా బలహీనత అది. దయచేసి మీరుగానీ రూపగారుగానీ ఈవిషయంలో నాకు సహాయంచేయాలి" అన్నాడు పుల్లారావు.

"ఆల్‌రైట్... మీరేమీ బాధ పడకండి. విషయం కనుక్కొని మీకు తెలియజేసే బాధ్యత మాది" అంటూ లేచాడు అశోక్.

* * *

"ఏమిటి మీరనేది? నేను రాబర్ట్‌తో ..ఛీ.. అలా అడగడానికి మీకునోరెలా వచ్చింది. అతడి వయసులో సగమైనా ఉంటుదా నా వయస్సు?

ఎప్పుడో చచ్చిపోయిన కూతుర్ని నాలో చూసుకుంటున్నాడతడు. దేశం దాటొచ్చినా అవే ఊహలునుకి.

ఓ మగాడూ ఆడదీ చనువుగా ఉంటే దానికదొక్కటే అర్థమా? మరేరకమైన సంబంధమూ వాళ్ళిద్దరి మధ్యా ఉండటానికి వీల్లేదా? కట్టుకున్న భర్తే ఏనాడూ నన్నిలా అనుమానించలేదు. కానీ మీరీ విషయం అడిగేవరకూ వచ్చారంటే మీ సంస్కారాన్ని తెలియజేసేటందుకింతకంటే ఉదాహరణేం కావాలి?

ఏదో మన దేశంవాళ్ళు అందులోనూ తెలుగువాళ్ళు ఎదురుగా ఉన్నారంటే ఎంతో ఆనందించాను నేను. కానీ ఇప్పుడు తెలుస్తోంది నా ఊహెంత పొరపాటో?" ఏడుస్తూ అంది మంగళ.

కన్నీళ్ళు కంట్లోనే ఇంకిపోయాయి రూపకు. ఓక్షణం వెర్రి ఆవేశం వచ్చిందామెకు. నీ భర్తకు నీమీద అనుమానం రావడం వల్లనే అతడి కోరిక మీదే అసలు సంగతేమిటో విన్నడగాల్సి వచ్చింది తల్లీ! నువ్వు నీ మొగుడు ఏ గంగలో కలిస్తే మాకెందుకు అని అడగాలనిపించిదామెకు.

కానీ ఏ పరిస్థితిలోనూ పుల్లారావు ప్రసక్తిరాకూడదని భర్త తనకు మరీమరీ చెప్పడం గుర్తొచ్చింది. అందుకే తన బాధను మనసులోనే దిగమింగుకుంది.

"పోన్లెండి నాదే పొరపాటు. పరాయి ఆడాళ్ళను తమతో తిప్పుకుంటూ తల్లిలానో చెల్లిలానో చూసుకుంటున్నామని చెప్పేసెంటిమెంట్ మన దేశంలోని మగాళ్ళకే ఉందేమో అనుకునేదాన్ని. కానీ ఇప్పుడే తెలిసింది నాకు. అటువంటి సెంటిమెంట్స్ ఈ దేశంలోనూ ఉంటాయని" తన ఉక్రోషం తీర్చుకుని చరచరా వచ్చేసింది రూప.

* * *

ఆ రాత్రి భర్తతో అంది మంగళ. "ఏమో అనుకున్నాముగానీ ఆ రూప ఎంత నాటిముచ్చో చూశారా? నేను వేళాపాళా లేకుండా ఇల్లొదిలేసి రాబర్ట్‌తో తిరుగుతున్నానని ఎవరో చెప్పారట.

నేను రాబర్ట్‌తో వేషాలు వేయడంవల్లనే మీకు ప్రమోషన్ వచ్చుంటుందని దాని అనుమానం. అయినా ఎవరేమనుకున్నా నాకేం? మరో ఇల్లు చూడండి. వీళ్ళ పొరుగున నేనుండలేను."

* * *

"సంబంధంలేని విషయాల్లో తలదూరిస్తే ఇలాగే ఉంటుంది. మీరడగమనడమూ నేనడగడమూనూ? బాగా బుద్ధొచ్చిందిలెండి. అయినా ఎవరెలా పోతే మనకేం! మరో ఇల్లు చూడడానికి మీకు పదిరోజులు గడువిస్తున్నాను. ఇంత జరిగాక వీళ్ళకెదురుగా ఉండటం నావల్ల కాదు"

భార్య మాటలువిని తలపట్టుక్కూర్చున్నాడు అశోక్.

* * *

అన్ని సౌకర్యాలు ఉన్నా ఇండియానుంచి వచ్చినవాళ్ళు ముఖ్యంగా తెల్గువాళ్ళు తరమూ ఇళ్ళెందుకు మారుస్తారో అర్థంచేసుకోవడానికి వెస్టరన్ బుర్రలకున్న తెలివి చాలలేదు.

*

చిరాకు

